
# అదో తరహా



## భట్టిప్రోలు విజయలక్ష్మి

"అమ్మా! మమత పెళ్ళిట ఈ నెల పదహారున. మామయ్యా శుభలేఖ పంపించాడు" అన్నాను బూట్లు విప్పుకుంటూ.

అమ్మ కాఫీ అందిస్తూ అంది - "ఇవా ళప్పుడే పన్నెండు. మరీ ఇలా ముహూర్తం ముంచుకొచ్చే ముందు పంపించా డేమిటీ శుభలేఖ" అంటూ, నా చేతిలో శుభలేఖ తీసుకుని చూసింది.

"పాపం! టైం లేకుండా అన్నీ చెయ్యాల్సి వచ్చిందేమో నమ్మా! అసలే పాపం మామయ్యకి కొడుకులు కూడా లేరు. అన్ని పనులూ మామయ్యే ఒక్కడే చూసుకోవాలి" అన్నాను మామయ్యా పట్ల సానుభూతిని చూపిస్తూ.

"నీ మొహం. వాడి సంగతి తెలియం దెవరికి? అస లీ శుభలేఖ పెళ్ళి అయ్యాక వచ్చినా ఆశ్చర్యపోను నేను."

"ఛ! కావాలని అలా ఎవరైనా చేస్తారా. ఏమిటీ మరీ అంటావు నువ్వు."

"నాకు చెప్పకురా కృష్ణా! వాడి దంతా అ దో తరహా. డబ్బే వైకుంఠం, డబ్బే కైలాసం, డ బ్బున్న వాళ్ళని ఒకలాగా, డబ్బు లేని వాళ్ళని ఒకలాగా చూస్తాడు" అంది హేళనగా అమ్మ.

"ఛ. అలాంటి దేం లేదు. నే నెప్పు డెళ్ళినా మామయ్యా బాగా గౌరవంగా చూస్తాడు" అన్నా.

"ఎందుకు చూడడూ! సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం, నెలకి నాలుగు వేలు స [illegible]న. నీ కున్న హోదాని చూసి నిన్ను ఆమాత్రం చూస్తున్నాడు కానీ, లేకపోతే నీ మొహమైనా చూడడు. వాడే కాదు, వాడి పెళ్ళామూ అంతే, పిల్లలూ అంతే. అంతా అ దో తరహా. డబ్బూ, పలుకుబడీ ఎవరికుంటే వాడి వెనకాల తిరుగుత రు. నా తోడబుట్టిన వాడి సంగతి నాకు తెలియదా?"

"ఎన్ని అయినా అను. నాకు మాత్రం మామయ్యా అలా అనిపించనే అనిపించడు" అన్నా మొండిగా.

"అవున్లే! అసలు నువ్వు మమత కన్నా చిన్నవాడివై బ్రతికిపోయావు కానీ, లేకపోతే నీ వెంట పడేవాడు దాన్ని చేసుకోమని. మేనరికం పేరుతో డబ్బులైనా మిగుల్చుకునేవాడు" అంది అమ్మ.

"ఛ. అలా అంటా వేమిటే? మమత మాత్రం మామయ్యా కూతురు కాదా? మమత కోసం డబ్బులు ఖర్చు పెట్టడానికి మామయ్యా వెనకాడత డా? అంతగా మేనరికం చేసి డబ్బులు మిగుల్చుకోవా లనుకుంటే పెద్ద పిన్ని కొడుకు సాగ రన్నయ్య లేడా? అసలు మామయ్యకి మేనరికాలే ఇష్టం ఉండి ఉండవు."

"ఒరి వెర్రినాయనా! సాగర్‌కి మమత నిస్తాడని ఎలా అనుకున్నావురా? నీకంటే నేను తప్ప ముందూ, వెనకా ఎవరూ లేరు. మంచి చదువూ, పెద్ద హోదా గల ఉద్యోగమూ ఉన్నాయి. సాగర్‌కి మంచి ఉద్యోగమూ లేదు. తల్లీ, తండ్రీ, ఇద్దరు చెల్లెళ్ళ బాధ్యత మీద ఉంది."

"అయితే మాత్రమేం? అన్నయ్యా చాలా మంచివాడు. మమతని నెత్తిన పెట్టుకుని చూసేవాడు. పిన్ని కూడా చాలా మంచిది."

"సరేలే. లేనిపోని కబుర్లు ఎందుకు కానీ, అవన్నీ జరిగేవా, పెట్టేవా? సెలవు పెడుతున్నావా పెళ్ళికి? ఎప్పుడు బయలుదేరదాం?" అంది అమ్మ.

"ముందరే వెళ్తే మంచిది. అసలే ఆడపిల్ల పెళ్ళి. ఎన్నో పనులూ, అవసరాలూ ఉంటాయి. మామయ్యా కసలే కొడుకులు లేరు. మగపిల్లల సాయం నేను చేస్తాను."

"ఆఁ. అలాగే చేద్దువు గానీ, పనుల్లో నిన్నూ నన్నూ చెయ్యి పెట్టనిచ్చినప్పటి మాట గదా!" అంది అమ్మ పెదవి విరిచి.

"అవును. మామయ్యా మనల్ని పనులు చెయ్యనివ్వడు. మనం అంటే మామయ్యకి చాలా గౌరవం" అన్నాను సంబరంగా.

"నీ మొహం. అందుకోసమే కాదు. మన మేమన్నా దుబారా చేసేస్తామేమో అని బెంగ పెట్టేసుకుని మనల్ని పనుల జోలికి రానీయడు. చూస్తూ ఉండు. కనీసం కాఫీలన్నా ఇవ్వనివ్వడు నిన్ను" అంది అమ్మ ఛాలెంజింగ్‌గా.

"అలాగే చూస్తూ ఉండు. పెళ్ళిలో పని చేసి

చూపెడతాను. కావాలంటే ఆ కాఫీలే ఇచ్చి చూపిస్తాను'' అన్నాను బింకంగా.

పెళ్ళికి పెద్ద పిన్ని కుటుంబం కూడా వచ్చింది. సాగర్ రావటంతో ఒంటరితనం తప్పింది నాకు. అమ్మ అన్నట్లే మామయ్యా, అత్తయ్యా నన్ను ఏ పనిలోనూ వేలు పెట్టనివ్వలేదు. అది ఎంత నామీద మామయ్యకి గల మర్యాద అనుకుందామన్నా ఏదో లోటుగానే ఉంది నాకు. ఎలాగైనా పెళ్ళి వారికి కాఫీలు ఇచ్చి అమ్మ ముందర మాట నిలబెట్టుకోవాలన్నది నా తాపత్రయం.

''రారా సాగర్! పెళ్ళి వాళ్ళకి కాఫీలు ఇచ్చి వద్దాం'' అంటూ సాగర్ని కూడా నాతో పాటు లాక్కొచ్చాను. మా చేతుల్లో కాఫీ ట్రేలు చూడగానే మామయ్య ఎక్కడ్నించి వచ్చాడో ఏమో పరుగు పరుగున వచ్చాడు.

''నీ కెందురా కృష్ణా! ఈ పనులన్నీ నువ్వూ సాగర్ చక్కగా ఆ పక్కన కూర్చుని అన్నీ చూస్తూ ఎంజాయ్ చెయ్యండి. ఈ పనికి మా సత్తిగా డున్నాడుగా! వాడు చూస్తాడులే. వాడి కన్నీ బాగా తెలును'' అన్నాడు మా చేతిలోని కాఫీ ట్రేలని సత్తిగాడికి అందిస్తూ.

''సత్తిగాడి పాటి చెయ్యలేనూ మేము మామయ్యా! అయినా ఇది తేలిక పనే గదా! ఆడపిల్ల పెళ్ళంటే మాటలా! ఎంతమంది చేసినా ఇంకా పనులు ఉంటూనే ఉంటాయి'' అన్నాను నేను.


''అది కాదురా. ఎవరికి ఎంత కాఫీ ఇవ్వాలో, ఎవరికి ఇవ్వక్కర్లేదో సత్తిగాడికి చెప్పాను. అవన్నీ నీకు తెలియవు. వాడయితే ఒకటికి రెండుసార్లు తాగేవాళ్ళని కనిపెట్టి పట్టుకుంటాడు.'' చెప్పాడు మామయ్య.

నాకు అసలు మామయ్య ఏం చెప్తున్నాడో అర్థమే కాలేదు. సాగర్ మాత్రం ఎప్పుడో అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

''కృష్ణా! లీటర్ పాలు ఏడు రూపాయలు పెట్టి కొన్నామా. అందరికీ కాఫీలు ఇవ్వాలంటే ఎంత ఖర్చో చూడు. ఏదో ముఖ్యులైన వాళ్ళకి ఇచ్చి, మిగిలిన వాళ్ళని చూసీచూడనట్లుండాలి. పైగా ఎటూ కాసేపట్లో భోజనాలు పెడతామాయె.'' మామయ్య చెప్తూనే ఉన్నాడు.

తెల్లబోయాను నేను. అవన్నీ నాకు నిజంగానే తెలియవు. అందుకే కాబోలు అమ్మ ఎప్పుడూ నన్ను లోకజ్ఞానం లేదురా. డిగ్రీ లయితే సంపాదించావు గానీ అంటుంది. ఏదో పెళ్ళికి వచ్చిన వారికి మర్యాద చేయటంవరకూ తెలును కానీ, ఇవన్నీ నాకు తెలియవు. ఎప్పుడూ వినలేదు కూడా. అదే అన్నాను సాగర్‌తో.

''కృష్ణా! మామయ్య గురించి నీకు నిజంగానే తెలియదురా! ఆయన కసలు సింగరాజు, లింగరాజు అని మారు పే రుంది బంధువుల్లో. అసలు అవన్నీ తెలిసే నేను పెళ్ళికి రానన్నాను. కానీ మా అమ్మ బలవంతంగా తీసుకువచ్చింది. పాపం! ఆవిడ భయం ఆవిడది. నేను రాకపోతే మమతని నాకు ఇవ్వనందుకు నేను ఏడుస్తున్నానని ఎక్కడ మామయ్య ప్రచారం



చేసేస్తాడో అని ఆవిడ భయం'' అన్నాడు సాగర్.

''అవున్రా. నేనూ, అమ్మ కూడా అనుకున్నాం. మమతని నీ కిస్తే బాగుండేదని.''

''ఇంకా నయం. ఇవ్వందే మేలు. ఇట్లాంటి వారికి ఎంత దూరంలో ఉంటే అంత మంచిది'' అన్నాడు సాగర్ నవ్వుతూ.

పెళ్ళి భోజనా లప్పుడూ సాగర్ చెల్లెళ్ళు శాంతి, కాంతీ వడ్డించబోతే అత్తయ్య అడ్డం పడింది.

''ఎందుకే హాయిగా ఓ పక్కన కూర్చోక అన్నింటికీ బయలుదేరుతారూ? వడ్డనకి వేరేవా ళ్ళున్నారులే. మీరు చిన్నపిల్లలు. మీకు తెలియదు. ఎలా వడ్డించాలో. ఎక్కువ తక్కువలు వడ్డించి అన్నీ మొదటి బంతికే అయిపోగొడితే తరువాత లేనిపోని ఇబ్బంది.''

శాంతీ, కాంతీ ఇవతలికి వచ్చేశారు. వాళ్ళ ముఖం చూస్తే జాలేసింది నాకు. ఇన్నాళ్ళూ నాకు తెలియని ఎన్నో విషయాలు ఇప్పు డిప్పుడే తెలుస్తున్నాయి.

భోజనాలప్పుడు ఒక్కొరికి ఒక్కొరకమైన మర్యాదలు జరిగినాయి. కొంతమంది పెద్దమనుషుల విస్తళ్ళలో వద్దన్నా ఆపకుండా స్వీట్లూ, పదార్థాలూ వడ్డించారు. కొంతమంది 'ఇంకొంచెం వేయండి' అంటున్నా వినిపించుకోకుండా ముందుకి సాగిపోయారు వడ్డించే వాళ్ళు.

''బహుశా ఎవరి కెంత వడ్డించాలో, ఎవరి కెన్నిసార్లు వడ్డించాలో వీళ్ళకి మామయ్య ట్రైనింగ్ ఇచ్చి ఉంటాడు'' అన్నాడు సాగర్ నవ్వుతూ.

మామయ్యా, అత్తయ్యల అసలు రంగు నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. వాళ్ళని అందరూ ఎందుకు అ దో తరహా మనుషు లంటారో బోధపడుతోంది. ఇలాంటి మనుషులూ ఉంటారా అనుకునేవాడిని ఇన్నాళ్ళూ.

పెళ్ళికి వచ్చిన ఆడవా ళ్ళందరికీ వెళ్ళేటప్పుడు ఇవ్వడానికని తాంబూలం, పళ్ళూ, పసుపూ, కుంకుమా, పువ్వులూ అన్నీ సిద్ధం చేసి ఉంచింది అత్తయ్య. ఆ పని చేయటానికి శాంతినీ, కాంతినీ పిలిచింది.

''చూడండమ్మా! ఇందాకట్నుంచీ సాయం చేస్తా నంటున్నారు కదా! ఇలా రండి. ఇటు వచ్చిన ఆడవా ళ్ళందరికీ పసుపూ, కుంకుమా ఇవ్వండి. కొంచెం మనిషి శుభ్రంగా ఉండి, ఒక నూర్రూపాయల చీర కట్టుకుంటే పువ్వులు కూడా ఇవ్వండి. ఇంకా కొంచెం ఖరీదైన మనిషి అనిపిస్తే తాంబూలంలో అరటిపళ్ళు పెట్టి ఇవ్వండి. మంచి పట్టుచీరతో, నగలూ అవీ ధరించి ఉంటే తాంబూలంతో పాటు ఈ స్వీట్ పాకెట్ ఇవ్వండి. కొద్దిమంది భారీ పెద్దమనుషు లున్నారు. వాళ్ళని కనిపెట్టి తాంబూలంలో టెంకాయ, స్వీట్ పాకెట్, పువ్వులూ, పసుపూ, కుంకుమా అన్నీ పెట్టి ఇవ్వండి. వచ్చిన మనిషి బట్టలూ, నగలను బట్టి చూసి ఇస్తూ ఉండండి. వచ్చిన అందరికీ టెంకాయ, తాంబూలాలు ఇవ్వాలంటే ఆరిపోతామే అమ్మా! జాగ్రత్త!'' అత్తయ్య చెప్తూనే ఉంది.

''ఏమిటో అత్తయ్యా! నువ్వు చెప్పింది ఒక్క ముక్క అర్థం కాలేదు'' అంది కాంతి.

''అవు నత్తయ్యా! ఏదో అందరికీ బొట్టూ, పువ్వులూ, తాంబూలం ఇవ్వమంటే ఇవ్వగలం కానీ, ఇలా వచ్చిన వాళ్ళ అంతస్తుని బట్టి చూసి చూసి ఇవ్వటం మా వల్లకాదు'' అంది శాంతి కాంతితో పాటు ఇవతలికి వచ్చేస్తూ.

''మాయదారి పిల్లలు. మాయదారి సమాధానాలు. తిని పోవటానికి వస్తారు. పని చెప్తే చాలు పరారు. మళ్ళీ చెప్పకపోతే చెప్పలేదంటారు. బంధువు లంటారు కానీ, అసలు రాబందులు అనాలి.'' అత్తయ్య విసుక్కుంటూ అన్నీ సర్దుకుంటోంది.

సాగర్ కోపంగా వెళ్ళబోయాడు. వెంటనే ఆపేశాను నేను. ''వద్దు సాగర్! ఎలాగూ ఇంకో గంటలో వెళ్ళిపోతున్నాం. ఈ కాసేపటికి గొడవ ఎందుకూ?'' అన్నాను.

తిరుగుప్రయాణంలో అంది అమ్మ - ''ఏరా! ఇప్పుడు తెలిసిందా నీ మేనమామ సంగతి. నేను ముందే చెప్పలా? వాడి దంతా అ దో తరహా. అట్లాంటి వాళ్ళకి దూరంగా ఉఉండాలి అని.''

''ఇప్పు డర్థం అయిందిలే అమ్మా కృష్ణకి! వాళ్ళ పద్ధతులూ, పెంపకం, సంస్కారం వేరు. మన పద్ధతులు వేరు. అందుకే అన్నాను మమతను నాకు ఇస్తానని మామయ్య రాకపోవటమే మేలని'' అన్నాడు సాగర్.

పెద్ద పిన్ని మాత్రం నన్ను వెనకేసుకొస్తూ - ''కృష్ణ మంచివాడు. వాడిలాగే అంత మంచిగా ఉండాలనీ, ఉంటారనీ వాడు అనుకుంటాడు. దాన్ని చూసి మీరంత వాడ్ని లోకజ్ఞానం లేనివాడని అంటూ ఉంటారు. కానీ వాడేం తెలివితక్కువవాడు కాదు'' అంది.

''అవును. వీడిదీ అంత అ దో తరహా'' అంది అమ్మ. అంత ఫక్కుమన్నారు. నేనూ జత కలిపాను. ★